# తాకట్టు

''ఎంతకావాలి?'' అడిగాడు సేఠ్ ధనీచంద్.

''పదివేలు'' అంది ఫాతిమా బేగం, పాన్ నములుతూ.

''ఏం వ్యాపారం సరిగ్గా నడవటం లేదా, ఇప్పుడెందుకంత డబ్బు?''

''ఏదో ఏడుస్తోంది. కొత్త పిట్ట వచ్చింది. జాన్, రాంధనూ తీసుకొచ్చారు. వాళ్ళకివ్వాలి. ఇంకా ఖర్చులున్నాయి''

''పదివేలంటే కష్టమేనే...'' నసిగాడు ధనీచంద్.

''ఎప్పుడూ ఇట్టాగే ఏడిచ్చస్తుంటావు. లక్ష్మీబాయిని తాకట్టు పెట్టుకో''

''ముప్పయ్యేళ్ళు పైబడ్డదదేం సంపాదించి ఏడుస్తుంది. రోజుకు పదిరూపాయలైనా ముడతయ్యా అని''

''పోనీ మేరీ. రోజుకు కనీసం వందైనా కళ్ళజూస్తుందది''

''మొన్నీ మధ్య కొత్తగా వచ్చింది. ఎవరదీ? ఆఁ పండరి కదూ, ఆ ఇద్దర్నీ తాకట్టు పెట్టు''

''ఓరి నీయమ్మ కడుపుకాల! నీ ఆశ పాడుకానూ! కాస్త సంపాదించే వాళ్ళనిద్దర్నీ నీ పరం చేస్తే, నే బొచ్చె పట్టుకుని అడుక్కోవాలి. ఎవర్నో ఒకళ్ళను మాత్రమే గిరివీ పెట్టుకో. ఆ ఒక్కదాని మీదే నెలరోజుల్లో వెయ్యా పదిహేనువందలు సంపాదిస్తావు. నీషనే హాయిగా ఉంది. కడుపులో చల్ల కదలకుండా డబ్బు సంపాదిస్తున్నావు'' అంది ఫాతిమా బేగం.

''సరే.. సరే.. నువ్వు పురాణం విప్పకు. పండరిని తాకట్టు పెట్టు'' అని పండరి పేరు ఖాతా పుస్తకంలో రాసుకుని, ఫాతిమా బేగం సంతకం తీసుకుని, పదివేలు లెక్కపెట్టి ఇచ్చాడు సేఠ్ ధనీచంద్.

సేఠ్ ధనీచంద్ తాత ముత్తాతలెప్పుడో మార్వారునుండి వచ్చి హైదరాబాదులో స్థిరపడ్డారు. పరంపరగా వచ్చిన వడ్డీవ్యాపారాన్నే చేస్తున్నాడతను. అతనికి తెలుగు బాగా వచ్చు. చదవనూ, రాయనూ వచ్చు. అయినా ఖాతాపుస్తకాలన్నీ తెలిగ్గా అర్థం కాని గొలుసుకట్టు రాజస్థానీ భాషలోనే వుంటాయి. అతడు జైన మతస్తుడు. అహింసావాది. సాయంత్రం చీకటి పడకముందే దుకాణం మూసేసి భోజనం చేస్తాడు. ఆపై తన మేడ మీద గదినుండి ఎదురుగా వున్న ఫాతిమా బేగం

వేశ్యాగృహంలో ఏం జరుగుతుందో గమనిస్తుంటాడు. అతని దుకాణంలో మహావీరుడి విగ్రహం ఉంటుంది. చుట్టూ జైన తీర్థంకరుల ఫోటోలు. ఓ పెద్ద కాయితం మీద హిందీలో అచ్చయిన నీతివాక్యాల్ని చక్కగా ఫ్రేము కట్టించి పెట్టుకున్నాడు. తెలుగులోకి అనువదిస్తే ఇలా ఉంటాయా నీతివాక్యాలు.

''మీ దగ్గరేముంది? ధనమే సర్వస్వం కాదు

ధనంతో వినోదాన్ని కొనుక్కోవచ్చు, కాని సుఖం మాత్రం లభించదు.

ధనంతో పుస్తకాలు కొనుక్కోవచ్చు, కాని బుద్ధిమాత్రం లభించదు.

ధనంతో మందులు కొనుక్కోవచ్చు, కాని ఆరోగ్యం మాత్రం లభించదు.

ధనంతో గుడులు కట్టించవచ్చు, కాని దేవుడు మాత్రం లభించడు'' ఇలా ఓ పదినీతి సూత్రాలున్న తర్వాత చరమసందేశం, ''అయితే స్వాధ్యాయం వల్ల మీ కోరికలన్నీ ఈడేరతాయి.'' అని వుంటుంది.

ఇవన్నీ డబ్బు అప్పు తీసుకునే వాళ్ళకోసమే. తన సొంతానికి ఏమీ అట్టి పెట్టుకోడు నిస్వార్థి సేఠ్ ధనీచంద్. వస్తువులు తాకట్టు పెట్టుకుని డబ్బు అప్పిస్తుంటాడు. వస్తువు విలువలో సగం కంటే అప్పు పెట్టడు. బంగారానికి మూడుశాతం,వెండికి నాలుగు శాతం, రాగి ఇత్తడికి ఐదు ఆరు శాతం వడ్డీ వసూలు చేస్తాడు. 'పెరిషబుల్ గూడ్స్' అయిన సానిపాపల్ని తాకట్టు పెట్టుకుంటే అతనికి పది, పదిహేను శాతం వరకూ వడ్డీ ముడ్తుంది. దీంట్లో చాలా రిస్క్ ఉంది. అయినా ఎక్కువశాతం వడ్డీ ముడ్తుంది కాబట్టి సాహసిస్తుంటాడదను.

'మహబూబ్‌కీ మెహందీ'లో వున్న ఫాతిమా బేగం లాంటి 'ఘర్‌వాలీ'లకు సేఠ్ ధనీచంద్‌తో తరుచూ పనిపడ్తూ వుంటుంది. పురాతన కాలంనుండి వస్తున్న వేశ్యావృత్తిని నిర్మూలించాలని పోలీసుశాఖ అప్పుడప్పుడూ ప్రయత్నించినా, మళ్ళీ మళ్ళీ కొత్తచివుళ్ళు వేస్తూనే వుంటుందది. వయస్సులో ఫాతిమాబేగం కూడా వృత్తిని అవలంబించింది. ప్రస్తుతం పదవీ విరమణచేసి, తనే ఘర్‌వాలీగా సొంతవ్యాపారం పెట్టుకుంది. ఆమెదగ్గర పది పదిహేనుమంది ఆడపిల్లలుంటారు. కొత్తవాళ్ళను తెచ్చుకోవాలనీ, వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలనీ ప్రయత్నం చేస్తోందామె. ఆ ప్రయత్నంలోనే సేఠ్ ధనీచంద్ దగ్గరకు వచ్చింది. ఎంత సంపాదించినా, తినటానికీ, తాగటానికీ, తార్పుడుగాళ్ళనూ, రౌడీలనూ పోషించడానికీ, పోలీసు మామూళ్ళకు, కోర్టు కేసులకూ, ఫైన్లు కట్టడానికీ సరిపోతుంటుంది. ఇలా ఎప్పుడయినా 'కొత్తపిట్ట'ల్ని కొనాల్సి వచ్చినప్పుడూ పెద్దమొత్తంలో డబ్బు అవసరమై సేఠ్‌ని ఆశ్రయిస్తుంటుంది. అది మెహందీలో ఉన్న ఘర్‌వాలీలందరకూ అలవాటే.

సేఠ్ ధనీచంద్ తాకట్టు పెట్టందే అప్పివ్వడు. ఎక్కువ మొత్తం అప్పు తీసుకునేటంత వెండీ,

బంగారం ఘర్‌వాలీల దగ్గర వుండదు. వాళ్ళ ఆస్తి సానులే. ఆ ఆస్తినే ఘర్‌వాలీలు తాకట్టు పెడ్తారు. తాకట్టులో వున్నంత కాలం, వాళ్ళ మీద సంపాదించే డబ్బు ఏరోజుకారోజు అణా పైసల్తో సహా సేఠ్ ధనీచంద్‌కు చెల్లించాల్సి వుంటుంది. అప్పు తీరిందాకా రోజూ పొద్దున్నే వచ్చి ఆ డబ్బు వసూలు చేస్తుంటాడతను. నమ్మకం మీదే నడుస్తుంటుంది అంతా. ఘర్‌వాలీలు అతన్ని మోసం చేయటానికి వీలు లేదు. వాళ్ళ అవసరాలు అంతటితో పోయేవి కావు. ఓ వడ్డీ వ్యాపారస్తుణ్ణి మోసం చేస్తే రెండో వాడెవడూ వాళ్ళకప్పివ్వడు. వృత్తిపరమైన మర్యాద అది.

ఫాతిమా బేగం తాకట్టు పెట్టిన పండరి వచ్చి ఆర్నెల్లయింది. ఆమెది తాండూరు. తల్లీ దండ్రీ షాబాదు బండలు పాలిష్ చేసే కార్ఖానాలో పనిచేసే వాళ్ళు. ఫ్యాక్టరీ దుమ్ముమూలంవల్ల క్షయ వ్యాధితో తీసుకుని పండరి తండ్రి చనిపోయాడు. తల్లి సంపాదన చాలక పండరి కలిగిన లోగిళ్ళలో పనిచేసి ఏ కొద్దిగానో సంపాదించేది. పదహారేళ్ళ పండరి చామనచాయగా వున్నా కనుముక్కు తీరు కుదిరిగ్గా వుంటుంది. ఆమెకు మనసులో ఎన్నో కోరికలుండేవి. మంచి మంచి గుడ్డలు కట్టుకోవాలనీ, సినిమాలు చూడాలనీ ఉండేది. అయితే దుర్భర దారిద్ర్యం ఆమెకలాంటి అవకాశాలు లేకుండా చేసింది. రోజూ సాయంత్రం తను పనిచేసే చోట్ల పనులు పూర్తి చేసుకుని వస్తూ సినిమాహాలు గోడలమీద అతికించిన పోస్టర్లను తన్మయంగా చూస్తూ వుండేది. అలా ఓ రోజు ఆమె సినిమాపోస్టర్లు చూస్తూ ప్రపంచాన్ని మర్చిపోయిన క్షణంలో, పక్కనే చాయ్ దుకాణంనుండి బయటకొచ్చిన జాన్ ఆమెను చూశాడు. కొత్తపిట్టల వేటలో వున్నాడతను. గాలం వేశాడు. వచ్చి ఆమెను పలకరించాడు. ''చిరంజీవి అద్భుతంగా నటించాడు ఆ సిన్మాలో, చూశావా?'' అని.

ఆమె ఆశ్చర్యంగా అతని వంక చూసింది. ''చూళ్ళేదు'' అంది.

''మరి వెళ్దాం రా'' అన్నాడతను.

''అమ్మో, నేను రాను'' అని పారిపోయింది ఆమె.

అప్పుడు సినిమాకు రాలేదు కాని, అతని గాలం నుండి తప్పించుకోలేకపోయింది ఆమె.

జాన్ అందంగా, బలంగా,సినిమాహీరోలా వుంటాడు. ఆమెకతను నచ్చాడు. ''మాది హైదరాబాదు. బంధువుల ఇంటికి వచ్చాను.'' అని చెప్పాడు జాన్ ఆమెకు. రోజూ సాయంత్రం ఆమె ఇంటికి వెళ్ళేటప్పుడు సినిమాహాలు వద్ద కలుసుకునేవాడతను. ఓ సారి అన్నాడు, ''హైదరాబాదు రారాదా! అక్కడ మస్తు అవకాశాలున్నాయి, పైన కమాయించడానికి. పని తేల్గ్గా దొరుకుతాది. నువ్వు ముందు నౌకరీలో చేర్తే, ఆ తరవాత మీ అమ్మను పిలిపించవచ్చు'' అని.

''అమ్మో! నాకాడెవరుండారు? నేనేడుండాలి'' అంది స్త్రీ సహజమైన బెరుకుతో.

''నేను లేనా నిన్ను చూడటానికి''

''ఏవో బాబూ! మాయమ్మ నడగాలి''

''అడుగు, హైదరాబాద్‌లో మా ఇంట్లో ఉండొచ్చు.''

''నేనెవరంటే మీ వాళ్ళకేం జెప్తావు?''

''నా పెళ్ళామని చెప్తాను''

''పెళ్ళి కాకుండానే పెళ్ళామని చెప్తావా?''

''పెళ్ళి చేసుకునే వెళ్దాం''

''మాయమ్మ ఈ పెళ్ళికి ఒప్పుకోదు. మీ మతం వేరు. మా మతం వేరు.''

''మరి చెప్పకు''

తల్లికి చెప్పలేదు కానీ, అతనితో హైదరాబాదు వెళ్ళటానికి సందేహించింది ఆమె. పట్నవాసాన్ని గూర్చి రంగురంగుల్లో చిత్రీకరించి చెప్పాడు జాన్ ఆమెకు. ''నేను వ్యాపారంలో బాగానే సంపాదిస్తున్నాను. నీ కసలు నౌకరీ చేయాల్సిన అవసరం లేదు. నిన్ను పువ్వుల్లో పెట్టుకు చూసుకుంటాను'' అని ఆశ కల్పించాడు.

అయినా ఆమేం మాట్లాడలేదు. ఓ వారం రోజులు జాన్ కన్పించలేదు ఆమెకు. ప్రతి సాయంత్రం అతనికోసం సినిమాహాలు దగ్గర చూసేది ఆమె. అతను కన్పించక ఆమె మనసు నిరాశతో కృంగిపోయేది. ఓ రోజు హఠాత్తుగా ప్రత్యక్షమయాడు జాన్. అమె మనసు ఆనందంతో ఉరకలు వేసింది.

''ఏయ్ పండరీ! నాకు ఇటు వచ్చేపనిలేదింక. నువ్వు వస్తానంటే రా, తీసుకెళ్తాను'' అన్నాడతను.

''మరి పెళ్ళి చేసుకుంటావా?'' అడిగింది ఆమె.

''ఎందుకు చేసుకోను? నిన్ను మరవలేకేగా తిరిగివస్తా''

''ఏమో నాకు భయంగా వుంది''

''నేను లేనూ నీకు భయమెందుకు?''అని నచ్చచెప్పాడు జాన్.

ఆ మర్నాడే పిట్టలు ఎగిరిపోయి ఫాతిమాబేగం గూటికి చేరాయి. వెళ్ళిన రోజు రాత్రి హాయిగా భార్యాభర్తల్లాగా గడిపారు పండరి, జాన్‌లు. అదొకటే రాత్రి, ఆమె జీవితంలో ఆనందం అనుభవించింది.

మర్నాటికల్లా ఆమెకర్థమయింది తానెక్కడకు వచ్చిందో. ఏడ్చింది. మొత్తుకుంది. జాన్‌మీదపడి కొట్టింది. ''పోవే ముండా! ఆడ కూడు దొరక్క ఏడుస్తున్నానంటే తీసుకొచ్చాను. ఏమయింది నీకు? మిగతా ఆడాళ్ళంతా ఏడుస్తున్నారా? హాయిగా డబ్బు సంపాదించి జల్సా చేసుకోక'' అని సమాధానపర్చ ప్రయత్నించాడు కాని మొండిది ఆమె వినలేదు. అతన్ని తిట్టడం

మొదలుపెట్టింది. అంతే. ''అరే రాంధన్! రా రా, దీని సంగతేందో చూద్దాం'' అని సహోపాధ్యాయుణ్ణి పిల్చాడు జాన్. అక్కడకొచ్చే ఆడపిల్లలకు నయాన, భయాన, కొట్టీ, తిట్టీ వృత్తిలో ప్రథమ పాఠాలు నేర్పే గురువులు వీళ్ళిద్దరే. ఇద్దరి బెల్టులు ఆమె శరీరంపై స్వైర విహారం చేశాయి. బట్టలు పేలికలయ్యాయి. శరీరం వాతలు తేలింది. ఆమె మూలగసాగింది బాధతో. ఆమెనంతటితో వదిలిపెట్టలేదు వాళ్ళు. ఒకరి తరువాత ఒకరు కిరాతకంగా చెరిచారు ఆమెను. లేని ఓపికను కూడదీసుకుని వాళ్ళను తోసెయ్యాలని చూసిందికాని, ఆమె తరం కాలేదు.

''ఇప్పుడేమంటావే తప్పుడుముండా!'' అని వెకిలిగా చూసి నవ్వాడు జాన్ ఆమెవంక.

ఆమె అతనివంక విద్వేషంతో చూస్తూ తుపుక్కున ఉమ్మేసింది.

దాంతో రెచ్చిపోయాడు జాన్, ''ఇంకా పొగరు చావలేదురా దీనికి'' అని మళ్ళీ బెల్టు తీసుకున్నాడు.

భయపడిపోయింది పండరి. ''వద్దు, కొట్టొద్దు, నీ కాళ్ళకు మొక్కుతాను'' అంది.

''మరేమంటావు? వృత్తి చేస్తావా?'' అడిగాడు జాన్.

''నావల్లకాదు. పెళ్ళి చేసుకుంటానని చెప్పి ఇట్లా చేయటం నీకు న్యాయం కాదు'' అంది.

''న్యాయమేందో నాకు తెల్సునే'' అని మళ్ళీ బెల్టుతో ఆమెని చావబాదాడు. ఆమె స్పృహ కోల్పోయింది.

మర్నాటికామెకు విపరీతమైన జ్వరం వచ్చింది. డాక్టర్ ఓల్డ్‌మాన్‌ని పిలిపించారు. వచ్చి, ఆమె పరిస్థితి చూసిన డాక్టర్ జాన్‌ని బండబూతులు తిట్టాడు. ''సైతాను వెధవా! ఆడపిల్లల్ని బ్రతకనివ్వర్రా మీరు'' అన్నాడు.

''చెప్పినమాట వినకపోతే మరేం చేస్తాం డాక్టర్‌సాబ్'' అన్నాడు జాన్.

''థూ తప్పుడు కొడకా! బయటకెళ్ళు. నీ మొహం నాకు చూపించకు'' అన్నాడాయన.

డాక్టర్ ఓల్డ్‌మాన్ వయసు డెబ్బై ఐదు, ఎనభై ఏళ్ళుంటాయి. నిజానికాయన పేరు కార్డినల్ యంగ్‌మాన్. నిజాం జమానాలో ఆర్మీ డాక్టరుగా వచ్చాడు ఆయన. ఇక్కడే ఓ హిందూ యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. భార్య చనిపోయినా, ఆమె జ్ఞాపకాలతో నిండిన హైదరాబాదు వదలి వెళ్ళలేకపోయాడు ఆయన. ఇంగ్లీషువాళ్ళు వెళ్ళి పోయినా భారత పౌరసత్వం తీసుకుని ఇక్కడే స్థిరపడిపోయాడు. మనిషి పొడుగ్గా, పచ్చగా దబ్బపండులా వుంటాడు. తెల్లగడ్డం. ఆ మొహల్లాలో ఎన్నేళ్ళనుండో ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నాడు. ఏ అవసరమొచ్చినా ఆయనే దిక్కు వేశ్యాగృహాలకు. ముసలి డాక్టరు, పాత వైద్యమవటంతో కొత్తరోగులెవరూ ఆయన దగ్గరకు రారు. ఆయనకీ డబ్బు సంపాదించాలనే తాపత్రయం లేదు. అలవాటుకొద్దీ పొద్దునా, సాయంత్రం డిస్పెన్సరీ తెరుస్తుంటాడు, వచ్చిన వాళ్ళకు మందులిస్తుంటాడు. ముసలి

డాక్టరవడంతో డాక్టర్ ఓల్డ్‌మాన్ అని పిల్చినా పట్టించుకోడు. అయితే నోరు తెరిస్తే తిట్టకుండా వుండలేడు ఆయన. జీవితంలో ఆయన చూసిన దుఃఖమంతా తిట్లరూపంలో వెలువడ్తుంటుంది. సానిపాపలు ఆయన తిట్లని పట్టించుకోరు, నవ్వుతుంటారు.

''స్టుపిడ్ గర్ల్! మళ్ళీ వచ్చి తగలడ్డావా. సుఖరోగం తగిలించుకుని మందులు తీసుకుంటున్నావు. నాలుగు రోజులు ఆగమంటే ఏం మాయరోగమొచ్చిది. రోగం తిరగబెట్టింది. కుళ్ళి చస్తావు. మిమ్మల్నా దేవుడుకూడా కాపాడలేడు.'' అని తిట్టేవాడు డాక్టరు.

''దేవుడనేవాడు వుంటే మాకీ గతి పట్టిస్తాడా హకీం సాబ్'' అనేది మేరీ.

''మరి చావు. నా దగ్గరకెందుకు వస్తావు'' అని కసిరేవాడు డాక్టర్ ఓల్డ్‌మాన్.

డాక్టరుకు ఈ నికృష్టజీవులపై అనంతమైన సానుభూతి, జాలి, దయ ఉండేవి. వాళ్ళకోసం తనేం చేయలేకపోతున్నానే అని బాధ పడేవాడు. సానిపాపలకు మందులు కొనటానికి డబ్బు లేకపోతే ఆయనే డబ్బిచ్చేవాడు. అస్వస్థతగా వుండి, సంపాదించలేక, తిండి తింటానికి డబ్బు లేకపోతే వాళ్ళు ఆయన్నే అప్పు అడిగేవాళ్ళు. ఆ అప్పులు తీర్చేవికావు. డబ్బు చేతులు మారిన క్షణంలోనే ఇద్దరూ మర్చిపోయేవారు.

ఎలాంటి ఆడదయినా సానికొంపల్లో జరిగే హింసకు దారికి రావాల్సిందే. పండరికీ తప్పలేదు. త్వరలోనే అలవాటుపడ్డది. మనిషి ఏపుగా, కనునదరుగా వుండేది. వయసు కూడా తక్కువే అవటం వల్ల ఆమె అంటే విటులు పడిచచ్చేవాళ్ళు. ఆమె రాబడి బాగా వుండేది. అందువల్లే సేఠ్ ధనీచంద్ మేరీ కంటే పండరినే తాకట్టు పెట్టుకోవటానికి ముందుకొచ్చాడు.

పండరి వృత్తికి అలవాటుపడ్డది గానీ, రాజీ పడలేదు. ఒకటి రెండు సార్లు తెలివితక్కువగా పారిపోబోయి జాన్ చేతిలో చావు దెబ్బలు తింది. జాన్ ఆమెకు మొగుడు. వృత్తిలో లేనప్పుడు అతనికి విశ్వసనీయంగా వుండాలి ఆమె. అప్పుడామె అతని ఆస్తి. పండరికి ఈ ఏర్పాటు నచ్చలేదు. జాన్ అంటే కంపరం ఆమెకు. ఇంకే మగాడ్నయినా సహించగలిగేదిగాని, జాన్ దగ్గరకు వస్తేచాలు మండిపడిపోయేది ఆమె. మిగతా సానులు ఆమెకు నచ్చచెప్ప ప్రయత్నించారు. ''ఇదే మంచి పద్ధతి. 'యార్' (తార్పుడుగాడు) నిన్నెప్పుడూ కాపాడుతుంటాడు. నువ్వంటే అతనికిష్టం కలిగితే నిన్ను పెళ్ళి చేసుకోనూవచ్చు. వాడివల్ల నీకు పిల్లలూ కలగొచ్చు. వృత్తి చేసినా నీ మొగుడూ, నీ పిల్లలూ నీకుండడం సంతోషం కల్గించే విషయం కాదా? నీకు జబ్బు చేస్తే నిన్ను కనిపెట్టుకుని ఉంటాడు'' అని. కాని పండరికి అతన్ని చూస్తేనే ఒళ్ళంతా కారం రాసుకున్నట్లుండేది. ఆశలు నిండిన తన పచ్చటి జీవితాన్ని హరించిన రాక్షసుడు కన్పించేవాడు ఆమెకి అతనిలో.

పండరిని తాకట్టు పెట్టిన ఆర్నెల్ల తర్వాత ఓ రోజు -

పండరికి పొద్దుటినుంచీ ఒంట్లో బాగాలేదు. ఫాతిమా బేగంతో చెప్పింది. 'తనారోజు పనికి

రాన'ని. 'సరేలే చూద్దాం' అంది ఆమె. పండరి ఎప్పుడైనా ఓ రోజు వృత్తి చేయకపోతే ఫాతిమా బేగంకేం నష్టం లేదు. ఆమెను తాకట్టు పెట్టుకున్న సేఠ్ ధనీచంద్‌కే నష్టం. ఎప్పుడయినా ఓసారి 'పండరికి ఒంట్లో బాగాలేదు. ఆమె పనిలోకి వెళ్ళలేదు' అని చెప్పి డబ్బు ఎగ్గొట్టినా సేఠ్ ధనీచంద్ నసుగుతాడు గానీ పెద్దగా ఏమీ అనడు. అందువల్ల ఫాతిమాబేగం ఆమె ఆ రోజు వృత్తి చేయాలని పట్టుబట్టలేదు.

అయితే పండరి ఖర్మకాలి ఆ రోజు ఆమె అంటే పడిచచ్చే విటుడు - బూరెబుగ్గలు, బుంగమీసాలు, బానకడుపున్న మునిసిపల్ కౌన్సిలర్ ధర్మరాజు వచ్చాడు. అతడువచ్చాడంటే ఆ రాత్రల్లా ఆమె అతడి అధీనంలో వుండాల్సిందే. ఫాతిమాకుకూడా బాగానే గిడుతుంది ఆరోజు. రాగానే విస్కీ బాటిల్సూ, చికెన్ బిర్యానీలు ఆర్డరు చేస్తాడు అతను. పండరికీ, ఫాతిమాకీ నజరానాలు బాగానే ముట్టజెప్తాడు. సేఠ్ ధనీచంద్‌కు పోయింది పోగా ఫాతిమాబేగంకూ బాగానే మిగుల్తుంది. అందువల్ల ధర్మరాజును అసంతృప్తిపర్చటం ఇష్టంలేక పండరిని తయారుకమ్మంది ఫాతిమా బేగం.

పండరికి భయమేసింది. ధర్మరాజెప్పుడొచ్చినా ఆమెకు భయమే. మనిషి జంతువు. అతనికి లైంగికానందం కంటే ఆమెను శారీరకంగా హింసించి ఆనందపడడం తృప్తి కల్గిస్తుంది. అసలే ఆమెకారోజు ఒంట్లో నలతగా ఉంది. అందువల్ల ''ఇవ్వాళ ఇంకెవర్నయినా పంపించు అమ్మీ! నా ఒంట్లో బాగాలేదు'' అని చెప్పింది పండరి.

''వాడో దయ్యం, వాడూరుకోడు. లేలే సిద్ధంకా!'' అంది ఫాతిమా బేగం ఆమె మాట వినకుండా.

''నే వెళ్ళను'' అని మొండికెత్తింది పండరి.

''అరె జాన్! దీని సంగతి చూడరా, లేవనంటోంది'' అని పిల్చింది ఫాతిమాబేగం, తీరిగ్గా ఆపిలుపండు ముక్కలు కత్తితో కోసుకుతింటూ.

''లేవే లంజా లే, నీ మిండ మొగుడు రంకెలేస్తున్నాడు గదిలో'' అంటూ వచ్చాడు జాన్. పండరి జాన్ వంక కోపంగా చూసింది.

''లెమ్మంటే నీక్కాదూ చెప్పేది'' అని ఆమె జుట్టుపట్టుకు లాగాడు జాన్.

పండరి భద్రకాళిలా లేచింది. ఫాతిమాబేగం చేతిలో వున్న కత్తి లాక్కుని ఒక్క పోటు పొడిచింది. కత్తి అతని భుజంలో గుచ్చుకుని రక్తం కారసాగింది. జాన్‌కి కోపంతో పిచ్చెక్కిపోయింది.

''ఓసి బద్మాష్ ముండా! నన్ను... నన్ను పొడుస్తావా! చంపుతావటే లంజా!'' అంటూ అల్మారులో వున్న ఏసిడ్ బాటిల్ తీసి ఆమె ముఖానికేసి కొట్టాడు.

సీసా పగిలి ఆమె కుడిచెంప, చెయ్యి, కుడివేపు శరీరభాగం కాలిపోసాగింది. పండరి బాధతో గిలగిలలాడిపోయింది.

''ఓరి ముదనష్టపోడా! నా బంగారాన్ని నాశనం చేశావు గదరా! గదమాయించరా అంటే ద్రావకం పోస్తావా దాని మొహాన! ఉండు పోలీసుల్ని పిల్చి నిన్ను జైల్లో పెట్టించకపోతే నా పేరు ఫాతిమా బేగమే కాదు!'' అని లబలబలాడింది ఘర్‌వాలీ.

బాధ భరించలేక పండరి నేలమీదపడి పొర్లుతోంది. రాంధన్ వచ్చి ఓ బిందెతో నీళ్ళు కుమ్మరించాడు కాలిన భాగాలమీద. ''ఇంకో బిందెడు తీసుకురాపో'' అంది ఫాతిమా. ఇంకో రెండు, మూడు బిందెల నీళ్ళు గుమ్మరించాడు రాంధన్. అయినా అప్పటికే ఆసిడ్ తన ప్రభావం చూపించింది. మొహం, కుడిభాగమంతా కాలిపోయి చర్మం ఊడిపోయింది. ఎర్రటి పుండులా వుంది.

ఈ గోలకు లోపల గదిలో విస్కీ సేవిస్తున్న ధర్మరాజు వచ్చి, ఆ స్థితిలో పండరిని చూడగానే అతని మత్తు కాస్తా దిగిపోయింది. పోలీసులొస్తారేమో, తాను అనవసరంగా పోలీసు కేసులో ఇరుక్కోవలసి వస్తుందని చల్లగా జారుకున్నాడు. మేరీని పంపి డాక్టర్ని పిలిపించింది ఫాతిమాబీబీ. 'పండరి బంగారు గుడ్లు పెట్టే బాతు. అలాంటి బాతును చంపి తినే ప్రయత్నం చేశాడు జాన్. రూపం పోయిన పండరి నెవరూ దగ్గరకు రానివ్వరు. అదింక వృత్తికి పనికిరాదు' అని ఫాతిమాబేగం జాన్‌మీద మండిపడుతోంది.

డాక్టరు రావటమే అందర్నీ తిట్టుకుంటూ వచ్చాడు. ''ఏడీ ఆ బద్మాష్! లుచ్చా! గాడ్దికొడుకు! వాడిమీద పోలీసు రిపోర్టు ఇస్తాను. ఈ పిల్లలు మనుషులనుకుంటున్నారా, పశువులనుకుంటున్నారా ఫాతిమా బేగం! ఆ కరుణామయుడైన దేవుడు కూడా నిన్ను క్షమించడు. నరకంలో పడిచావు. అమాయకపిల్లను చంపేశావు కదే రాక్షసీ'' అన్నాడాయన పండరిని పరీక్షిస్తూ.

''నేనేం జేయను హకీం సాబ్! ఆ హరాంఖోర్ నా బంగారు బాతును పొట్టన బెట్టుకున్నాడు. ఇంక దీని మొహమెవరు చూస్తారు. దీని మీద పెట్టిన పెట్టుబడి అంతా వృథానే. నేనేం జేయాలిరో తండ్రీ! నా నష్టం ఎవరు పూడుస్తార్రో బాబూ'' అని శోకాలు పెట్టసాగింది ఫాతిమా బేగం.

''ఛస్ నోర్ముయ్యి! పిల్లను చంపి నష్టపోయానని ఏడుస్తావు. ఇంతవరకూ రండాపనే చేస్తున్నావనుకున్నాను గానీ, ఇప్పుడు ఖూనీలుకూడా చేయటం మొదలుపెట్టావు. ఈ పిల్లను ఆసుపత్రిలో చేర్పించాలి. డబ్బుతీ'' అన్నాడు డాక్టర్ ఓల్డ్‌మాన్.

''నా దగ్గరేం లేదు'' అంది ఫాతిమా బేగం.

''డబ్బెందుకు లేదు. సంపాదించేదంతా ఏం చేస్తున్నావు?'' అన్నాడు ఈ గోలంతా విని అప్పుడే గదిలోకడుగొట్టిన సేఠ్ ధనీచంద్. అతనితోపాటు అతని అనుచరులిద్దరూవచ్చారు.

పండరిని చూడగానే హతాశుడయిపోయాడు సేఠ్ ధనీచంద్. ఇహ ఈ పిల్ల లాభం లేదు. నయానో, భయానో తాకట్టు మరో పిల్ల పేరున మార్పించుకోకపోతే తను నష్టపడిపోతాడు.

''నా దగ్గర నయాపైస లేదు. ఇంకపైన సంపాదించలేదు అది. ఇంక దానిమీద ఖర్చు పెట్టడం దండగ'' అంది ఫాతిమా బేగం.

''మరి నా సంగతేం చేస్తావు. నన్ను నష్టపరుస్తావా? తాకట్టు మార్పించు. మేరీ పేరనో, ఆ కొత్తగా వచ్చిన పిల్ల పేరనో మార్పించు'' అన్నాడు సేఠ్ ధనీచంద్.

''ఓరి చచ్చినాడా! నేనసలే నష్టపోయి ఏడుస్తుంటే, తాకట్టు మార్పించాలని గొంతుమీద కూర్చుంటావా? నీ జిమ్మడ! నీ పాడెబెట్ట! నీ శవం కాలిపోను!'' అని తిట్టసాగింది ఫాతిమా బేగం.

''నాకదంతా అనవసరం. నా అప్పయినా తీర్చు. తాకట్టయినా మార్చు. లేకపోతే పండరిని చంపావని పోలీసు రిపోర్టిస్తాను'' అన్నాడు సేఠ్ ధనీచంద్.

''ముయ్యండి నోళ్ళు ఇద్దరూ, సైతానుల్లారా! మీ ముఖాలు చూస్తేనే పాపం వస్తుంది. పిల్లను తీసుకెళ్ళి ఆస్పత్రిలో చేర్పిస్తాను. ట్రీట్‌మెంట్ ఇవ్వకపోతే అన్యాయంగా చచ్చిపోతుంది. డబ్బు సంచులు మెడక్కట్టుకుని గంగలో దిగండి. అవి సీదా మిమ్మల్ని నరకానికీడ్చుకెళ్తాయి'' అన్నాడు డాక్టరు.

''నా తాకట్టు సంగతి తేలకుండా ఆ పిల్ల ఇక్కడనుండి కదలటానికి వీల్లేదు'' అన్నాడు సేఠ్ ధనీచంద్.

''ఇప్పటికే ఎనిమిది వేలు కట్టాను. రెండు వేలకోసం తాకట్టు మార్చాలా'' అంది ఫాతిమా బేగం.

''ఇదుకో ఫాతిమా బేగం! డబ్బు దగ్గర నేను నిక్కచ్చి మనిషిని. మిగిలిన రెండు వేలయినా కట్టు, లేకపోతే తాకట్టు మార్పించు'' అన్నాడు సేఠ్ ధనీచంద్.

ఇప్పటికే చాలనష్టపోయింది ఫాతిమాబేగం. మళ్ళీ తాకట్టు మార్చి నెలకు వెయ్యా, పదిహేనొందలు నష్టపోవటం ఆమెకిష్టం లేదు.

''నువ్వేం చేసుకుంటావో చేసుకోపో, నేను తాకట్టు మార్చను. నీ రెండువేలు నెలరోజుల్లో తీర్చేస్తాను'' అంది ఫాతిమా బేగం.

''అలా వీల్లేదు. ఓరే, భీంసింగ్, రాంసింగ్ ! ఈ పిల్ల శవం ఇక్కడనుండి కదలకుండా చూడండిరా, నేను వెళ్ళి పోలీసు రిపోర్టిచ్చొస్తాను.'' అన్నాడు సేఠ్ ధనీచంద్.

''పో, ఇచ్చుకోపో, మేమేం అంత పోలీసులనెరగని మొహాలం కాదు! ఓరే ఎక్కడ చచ్చార్రా

జాన్, రాంధన్, దీన్ని తీసుకెళ్ళి బయట పారెయ్యండిరా'' అంది ఫాతిమా బేగం రొజుకుంటూ, రొప్పుకుంటూ.

చేతికి కట్టుకట్టుకున్న జాన్, రాంధన్‌లు వచ్చారు పండరిని ఎత్తి బయటకు తీసుకెళ్ళడానికి. రాంసింగ్, భీంసింగ్ వారికడ్డమొచ్చారు. అక్కడ పెద్ద దొమ్మీ ఏదో అయ్యేట్టుంది.

డాక్టర్ ఓల్డ్‌మాన్ రెండు పార్టీల రౌడీలను పక్కకు నెట్టాడు. విచిత్రంగా ఆయన ముఖంలో కోపమే లేదు. ''ఒరే, ధనీచంద్! రాసిపెట్టుకున్నావు గా నీ దుకాణంలో స్వాధ్యాయం చెయ్యరా నీ కోరికలన్నీ సఫలమవుతయ్యి! మనుషులు చచ్చినా ఫర్లేదు, నీ డబ్బు నీకు ముడుతుంది. మానవత్వాన్నీ, దయనూ, పుణ్యాన్నీ తాకట్టు పెట్టుకుని బతుకుతున్నావురా ఈ లోకంలో. ఆ పైలోకంలో మీ మహావీరుడికి అసలు అణాపైసల్తో చెల్లించాలని గుర్తుంచుకో. ఇంతకీ ఎంతరా నీ బాకీ, రెండు వేలేనా! నేనిస్తాను. ఆ పిల్లను ఆస్పత్రిలో చేర్పించనీ. అడ్డం రాకు'' అని జేబులోంచి చెక్‌బుక్ తీసి, రెండువేలకు చెక్కు రాసిచ్చాడు డాక్టరు.

''హకీం సాబ్! నేనూ నష్టపోయాను. నన్నూ దయతల్చండి'' అంది ఫాతిమాబేగం.

''ఫాతిమాబేగం! ఆడపిల్లల్ని తార్చి సంపాదిస్తున్నందుకు కూడా నిన్ను నిందించను గానీ, ఇలా మనుషులపట్ల ఏమాత్రం జాలి లేకుండా బతికుండగానే పాతిపెట్టాలనుకునే నువ్వు ఏ లోకాలకు పోతావో నాకు తెలియదు. ఆ దేవుడే నిన్ను కరుణించాలి. నా వల్ల కాదు. ఆ పైవాణ్ణీ తార్చెయ్యి బతికిపోతావు.''

ఫాతిమాబేగం ఏం మాట్లాడలేకపోయింది. సానిపాపలంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

''అమ్మాయి పండరీ! లేవగలవా, ఎట్లా వున్నావమ్మా'' అన్నాడు డాక్టరు పండరి వైపు వంగి.

''హకీం సాబ్! నా కుడికన్ను పోయింది. ఏమీ కన్పించటం లేదు.'' అంది పండరి బాధగా.

''ఓ కన్ను పోతే ఏం పోయిందమ్మా! మంచి జీవితం గడపడానికి ఆ కన్ను తాకట్టు పెట్టాననుకో. ఏం పోయినా, జీవితం పోకుండా వుండాలి తల్లీ! అప్పుడన్నీ తిరిగి సంపాదించొచ్చు. నా రెండు కళ్ళూ నీవే తల్లీ! లే, లే వెళ్ళిపోదాం'' అంటూ ఆమెని లేపి, తన ముసలి భుజాలమీద ఆమె భారం వహిస్తూ, ఆమెని నడిపించుకుంటూ వెళ్ళిపోయాడు డాక్టర్ ఓల్డ్‌మాన్.

'ఈనాడు' ఆదివారం

9-1-1994